నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
10 | ఖమ్మం, శనివారం 14 డిసెంబర్ 2024 | BHADRADRI KOTHAGUDEM

అన్నీ కొర్రీలే పెడుతున్నారు..

ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్తే తేమ శాతం రాలేదని, వడ్లు ఆర లేదని నిబంధనలు పెట్టి రోజుల తరబడి కేంద్రం వద్దనే పడిగాపులు కాయాల్సి వస్తున్నది. అందు వల్ల రైతులు చాలామంది దళారులకే విక్ర యిస్తున్నారు. రేటు ఎంతవచ్చినా తొంద రగా పని అయిపోతుందని, డబ్బులు వెంటనే వస్తాయని ధీమా ఉంది.

–రావులపల్లి పృథ్వీ, రైతు, సర్వాపురం, దుమ్ముగూడెం

డబ్బులు లేటు చేస్తున్నారు..

ధాన్యం కొంటున్నారు.. కానీ.. డబ్బులు వెంటనే రావడం లేదు. బోనస్ కోసం వారాలు వారాలు తిరగాల్సి వస్తున్నది. పేరుకే కొనుగోలు కేంద్రాలు.. ఇబ్బందులు చాలా ఉన్నాయి. గతంలో ఇలాంటి నిబంధనలు లేవు. ధాన్యం తీసు కెళ్లిన రోజే కొనేవాళ్లు, వెంటనే సొమ్ములు కూడా బ్యాంకు ఖాతాలో పడిపోయేవి.

–సూర వెంకటేశ్వరరావు, రైతు, తిప్పనపల్లి, చండ్రుగొండ

రైతులకు ఎక్కడా ఇబ్బంది లేదు..

ధాన్యం అమ్మిన 48 గంటల్లో సొమ్ములు రైతుల ఖాతాల్లో పడుతున్నాయి. ఎక్కడైనా తప్పులు పడితే బ్యాంకుల వద్ద ఆలస్యమ వుతుందేమో కానీ మా ఆఫీసులో మాత్రం లేటు లేదు. ధాన్యానికి సొమ్ములు పడగానే బోనస్ డబ్బులు కూడా పడిపోతు న్నాయి. రైతులకు ఎక్కడా ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

–త్రినాథ్‌బాబు, డీఎం, సివిల్ సప్లయీస్, భద్రాద్రి కొత్తగూడెం

రైతులు కష్టపడి పండించిన ధాన్యం కొనుగోళ్ల విష యంలో రాష్ట్ర సర్కార్ బాగా నిర్లక్ష్యం చేస్తున్నది. రైతు భరోసా ఇవ్వకుండా.. అర్హులందరికీ రుణ మాఫీ చేయకుండా అన్నదాతలను చిన్నచూపు చూస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం పంటలను సైతం సక్రమంగా కొనే పరిస్థితి లేకుండాపో యింది. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ లక్ష్యం మేరకు కొనుగోళ్లు పూర్తిచే యడం లేదు. ప్రణాళిక లక్ష్యం కొండంత ఉంటే.. కొనేది గోరంత ఉంటున్నది. కొనుగోలు కేంద్రా లకు వచ్చిన ధాన్యాన్ని కొనకుండా అనేక కొర్రీలు పెట్టి రైతులను ఏడిపిస్తున్నది. దీంతో రైతులు చేసే దేమీలేక దళారులకే పంటలను నిలువునా అమ్ము కుంటున్నారు. సర్కారు పెట్టే నిబంధనలు రైతుల్ని నిరుత్సాహానికి గురిచేస్తున్నది. కేవలం కొనుగోలు కేంద్రాల వద్ద అధికారులు పెట్టే కొర్రీలతో కొను గోళ్లు పూర్తిగా తగ్గుముఖం పడుతున్నట్లు లెక్కలు చెబుతున్నాయి.

–భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ)

లక్ష్యం కొండంత.. కొనేది గోరంత

- వరిధాన్యం కొనుగోళ్ల లో రాష్ట్ర సర్కార్ నిర్లక్ష్యం
- కొనాల్సింది 1.25 లక్షల మెట్రిక్ టన్నులు..
- కొన్నది 27,850 మెట్రిక్ టన్నులే..
- కొనుగోలు కేంద్రాల్లో కొర్రీలకు రైతన్నలు విలవిల
- ధాన్యం సొమ్ముల కోసమూ ఎదురుచూపులు
- బోనస్ నగదు మరింత ఆలస్యం
- జనవరికల్లా కొనుగోళ్ల లక్ష్యం పూర్తయ్యేనా?

చండ్రుగొండలో కల్లంలో ఆరబోసిన ధాన్యం

భద్రాద్రి జిల్లా వ్యాప్తంగా 160 కొనుగోలు కేంద్రాల్లో జీసీసీ, సొసైటీ, ఐకేపీ ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేస్తు న్నారు. ధాన్యం కొనుగోలులో సర్కారు ప్రతి ఏటా పౌర సరఫరాల శాఖకు ఒక లక్ష్యాన్ని నిర్దేశిస్తుంది. పంటల దిగుబడిని బట్టి ఈ ఏడాది 1.25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు అంచనా ప్రణాళిక సిద్ధం చేశారు. కానీ, సివిల్ సప్లై అధికారులు మాత్రం ఇప్పటివరకు 27,850 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారు. కొంతమంది రైతులు కొను గోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించగా.. మరికొందరు దళారులకు విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొను గోలు కేంద్రాల వద్ద తరుగు, తేమ శాతం, బాగా ఆరబె ట్టాలని నిబంధనలు పెట్టడంతో రైతులు విసుగు చెంది దళారులకు అమ్ముకున్నారు. ఇదేకాక 48 గంటల్లో ఖాతాల్లో పడాల్సిన ధాన్యం సొమ్ములు రోజుల తరబడి పడకపోవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు.

బోనస్ తంతూ అంతంతే..

ఈ ఏడాది సన్నవడ్లు పండిస్తే పంట డబ్బులతోపాటు బోనస్ కూడా వెంటనే ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం మాట ఇచ్చింది.. కానీ.. అది ఆచరణలో సాధ్యం కావడం లేదు. పంటను విక్రయించిన వెంటనే బోనస్ ఇస్తానన్న అధికారులు ధాన్యం డబ్బులతోపాటు కాకుండా పదిరోజుల తర్వాత బోనస్ డబ్బులు ఖాతాల్లో జమ అవుతుండడంతో రైతులు ఆందోళన చెందుతు న్నారు. పెట్టుబడికి అప్పులు చేసి సాగు చేసిన రైతులు రోజులతరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లావ్యాప్తంగా 30 లక్షల క్వింటాళ్ల సన్నబియ్యం వడ్లను కొనుగోలు చేయాల్సి ఉండగా.. ఇప్పటివరకు కేవలం 17.11 లక్షల క్వింటాళ్ల వడ్లను మాత్రమే కొనుగోలు చేశారు. ఇందుకు గాను రైతులకు రూ.8.6 కోట్ల డబ్బులు చెల్లించగా.. ఇంకా రూ.5.2 కోట్లు చెల్లించాల్సి ఉంది.

అల్లు అర్జున్ అరెస్టు సిగ్గుచేటు

- రైతుకు బేడీల విషయం పక్కదారి పట్టించేందుకే..
- బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు

ఖమ్మం, డిసెంబర్ 13: లగచర్ల గిరిజన రైతు చేతికి కాంగ్రెస్ ప్రభుత్వం బేడీలు వేసిన విష యాన్ని పక్కదారి పట్టించడం కోసమే నటుడు అల్లు అర్జున్‌ను అరెస్టు చేశారని బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాతీయ అవార్డు గ్రహీత, ప్రముఖ హీరో అల్లు అర్జున్‌ను దుస్తులు మార్చుకోవడానికి కూడా సమయం ఇవ్వకుండా అరెస్టు చేసి తీసుకెళ్లడం దారుణమన్నారు. చట్టం తన పని తాను చేసు కుంటూ పోతుందని కాంగ్రెస్ నాయకులు కవర్ చేసుకోవడం సిగ్గుచేటు అని పేర్కొన్నారు. చట్టం తన పని తాను చేస్తే ముందుగా జైలుకు వెళ్లాల్సిన వ్యక్తి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డేనని, తన సొంత గ్రామంలో సాయిరెడ్డి అనే వ్యక్తి తన చావుకు కారణం రేవంత్ రెడ్డి, అతడి సోద రులే అని రాసి చనిపోయినట్లు గుర్తుచేశారు. గుండెపోటు వచ్చిన లగచర్ల గిరిజన రైతుకు బేడీలు వేసిన విషయంపై రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లో అసంతృప్తి రగులుకోవడంతో దాన్ని పక్క దోవ పట్టించడం కోసం అల్లు అర్జున్‌ను అక్ర మంగా అరెస్టు చేసి కాంగ్రెస్ ప్రభుత్వం చట్టాన్ని తన చుట్టంగా చేసుకుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకులకు ఒక న్యాయం, ఇతరులకు మరో న్యాయమా? అని ప్రశ్నించారు.

తేనెటీగల పెంపకంతో ఉపాధి

గిరిజనులు సేకరించే తేనెకు మార్కెట్‌లో డిమాండ్: ఐటీడీఏ పీవో రాహుల్

శిక్షణ పూర్తి చేసుకున్న గిరిజన యువతతో భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్

భద్రాచలం, డిసెంబర్ 13: గిరిజన యువతీ యువకులు తేనెటీగల పెంపకాన్ని కుటీర పరిశ్ర మలా ఏర్పాటు చేసుకుని జీవనోపాధి పొందవ చ్చని, దీనికి ఐటీడీఏ సహాయ సహకారాలు అందిస్తుందని భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. తేనేటీగల పెంపకంపై మెళకువలు తెలు సుకోవడానికి రీసెర్చ్ సెంటర్‌కు వెళ్లి వచ్చిన గిరి జన యువతీ యువకులు పీవోను శుక్రవారం ఆయన చాంబర్‌లో కలిశారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ తేనెటీగల పెంపకంపై పూర్తిస్థా యిలో శిక్షణ పొందిన యువతకు పీఎంఈజీపీ ద్వారా యూనిట్లు ఇప్పించేందుకు కృషి చేస్తా మని, గిరిజనులు సేకరించే తేనెకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. తేనె విక్రయించేం దుకు ఐటీడీఏలోని మ్యూజియం వద్ద అనుమ తులు సైతం ఇస్తామని సూచించారు. కుటీర పరి శ్రమ నెలకొల్పేవారికి లైసెన్స్‌లు, తేనెటీగలు పెంచుకోవడానికి ప్రతి యూనిట్ సభ్యులకు ఐదు బాక్సుల చొప్పున అందిస్తామని పేర్కొన్నారు. ఏపీవో డేవిడ్‌రాజ్, ఉద్యానవన అధికారి ఉదయ్ కుమార్, జేడీఎం హరికృష్ణ, హార్టికల్చర్ సైంటిస్ట్ లక్ష్మీనారాయణమ్మ, ఆర్గానిక్ కోఆర్డినేటర్ శివ, గిరిజన యువకులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యాన్ని దారిమళ్లిస్తే ఉపేక్షించం

- ఖమ్మంలో రెండు రేషన్ షాపులు సీజ్..
- ఎన్‌ఫోర్స్‌మెంట్ ఓఎస్‌డీ అంజయ్య

ఖమ్మం అర్బన్ గోదాములో తనిఖీ చేస్తున్న అధికారులు

రఘునాథపాలెం, డిసెంబర్ 13: పేదలకు చేరాల్సిన రేషన్ బియ్యాన్ని పక్కదారి మళ్లిస్తే ఉపే క్షించేది లేదని ఎన్‌ఫోర్స్‌మెంట్ ఓఎస్‌డీ అంజయ్య హెచ్చరించారు. హైదరాబాద్ నుంచి ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం రెండురోజులపాటు ఖమ్మం నగరంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో రేషన్‌షాపులు, ఎంఎల్ఎస్ పాయింట్లను తనిఖీ చేశారు. శుక్రవారం ఖమ్మం అర్బన్ మండల లెవల్ స్టాక్ పాయింట్‌ను సందర్శించారు. గోదాం ఆర్ఐ మాధవి వద్ద ఉన్న బియ్యం స్టాక్ వివరాలను పరిశీలించారు. గోదా ములో ఉన్న సీసీ కెమెరాలు పని చేయకపో వడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. అంతేకాక గోదాములో సీజ్ చేయగా వచ్చిన పీడీఎస్ బియ్యం కుప్పలుగా పారబోసి ఉండటం పైనా మండిపడ్డారు. 2021 నుంచి సీజ్ చేసిన 4 లారీల బియ్యం సకాలంలో వేలం వేయకపోవడంతో మట్టిపాలు అయ్యిందని ఆవేదన చెందారు. ఈ సందర్భంగా గోదాం ఇన్‌చార్జి, హమాలీలపైనా ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ జిల్లాలో రెండురోజులుగా 10 రేషన్‌షాపులను తనిఖీ చేయగా ఖమ్మం మేదరబ జార్‌లో లాల్‌జానీ పాషా నిర్వహిస్తున్న షాపులో 30 క్వింటాళ్లు, మరోషాపులో 20 క్వింటాళ్లు తేడా ఉండటాన్ని గుర్తించామన్నారు. అక్రమా లకు పాల్పడుతున్న సదరు రెండుషాపులనూ ఇన్ చార్జిలు నిర్వహిస్తున్నారని, కేసును సివిల్ సప్లై డీటీ విజయ్‌బాబుకు అప్పగించినట్లు తెలిపారు.

దుమ్ముగూడెంలో నారు పోస్తున్న యాసంగి రైతులు

వానకాలం సాగులో బిగుబడి తగ్గింది..

మూడెకరాల్లో అప్పట్లో వానకాలం పంట సాగు చేశారు. దిగు బడి గణనీయంగా తగ్గింది. పంటను అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రాలకు వెళదామంటే అక్కడ ఎలాంటి సౌకర్యాలు కల్పించ లేదు. పంటను దళారులకు అమ్ముకునే పరిస్థితిని ప్రభుత్వం కల్పిం చింది. తాజాగా యాసంగి పంటను సాగు చేద్దామనుకుంటే ఇంత వరకు పెట్టుబడి సాయం అందించలేదు. మరోవైపు సీడ్ కంపెనీలు యాసంగి సీడ్ సాగుకు పెట్టుబడి సాయం ఎకరాకు రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు అందిస్తుండడంతో అటువైపు మొగ్గు చూపుతున్నాం.

–బొడ్డు వెంకన్నబాబు, రైతు, చిన్నబండిరేవు, దుమ్ముగూడెం మండలం

యాసంగి వచ్చె.. 'పెట్టుబడి' రాకపాయె..

- ప్రభుత్వ సాయం అందక పోవడంతో రైతుల అవస్థలు
- చేసేదిలేక సీడ్ పంటల వైపు అన్నదాతల మొగ్గు

దుమ్ముగూడెం, డిసెంబర్ 13: పంటలకు పెట్టు బడి సాయం అందక రైతులు నానా పాట్లు పడుతు న్నారు. ఖరీఫ్ సాగును ఎన్నో ఒడిదొడుకుల మధ్య పూర్తి చేసిన అన్నదాతలు.. యాసంగి సాగుకు సిద్ధ మవుతున్నారు. ఖరీఫ్ ధాన్యాన్ని అమ్ముకునేందుకు కొనుగోలు కేంద్రాల్లో కొర్రీలు, నిబంధనలు పెడు తుండడంతో ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు యాసంగి సాగుకు పెట్టుబడి సాయం కాంగ్రెస్ ప్రభుత్వం అందించకపోవడంతో సీడ్ పంటల వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. మండలంలో సుమారు 1,300 ఎకరాల్లో సీడ్ పంటను రైతులు సాగు చేయనున్నారు. శక్తి, పయనీర్, అన్నపూర్ణ, సింజింటా, బేయర్ తదితర కంపెనీల ప్రతినిధులు ముందుగానే రైతులకు పెట్టుబడి పెట్టి యాసంగి సాగు చేసేందుకు ప్రోత్సహిస్తుండడంతో వాణిజ్య పంటలు వేయకుండా.. సీడ్ పంటలు సాగు చేసేం దుకే మక్కువ చూపుతున్నారు. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సాగుకు ముందుగానే పంట పెట్టుబడి సాయం అందించడంతో ఆనాడు అన్నదాతలు వాణిజ్య, సహజ పంటలపై దృష్టి సారించారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను చిన్నచూపు చూస్తుండడంతో పంటల పెట్టుబడి కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో సీడ్ పంటల కంపెనీ ప్రతినిధులు ముందుగానే రైతు లకు ఎకరాకు రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు పెట్టుబడులు అందిస్తుండడంతో ఆ సాగు వైపు రైతులు అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే దుమ్ముగూడెం మండలంలో ఎస్.కొత్తగూడెం, కాశీ నగరం, సున్నంబట్టి, కె.లక్ష్మీపురం, పెద్దనల్లబల్లి, వర్క్‌షాప్ తదితర గ్రామాల్లో 1,300 ఎకరాలకు పైగా సీడ్ సాగు చేపట్టేందుకు నారుమడులు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అన్నదాతలను గుర్తించి సకాలంలో పెట్టుబడి సాయం అందిస్తే అప్పు చేయకుండా సాగు చేసుకుంటామని పలు వురు వేడుకుంటున్నారు.

పకడ్బందీగా 'గ్రూప్-2' నిర్వహణ

రేపు, ఎల్లుండి రెండు సెషన్లలో పరీక్షలు: ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

పరీక్షల నిర్వహణ సమావేశంలో మాట్లాడుతున్న ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

మామిళ్లగూడెం, డిసెంబర్ 13: జిల్లాలో ఈ నెల 15, 16 తేదీల్లో జరిగే గ్రూప్-2 పరీక్షను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ముజ మ్మిల్ ఖాన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస రెడ్డితో కలిసి గ్రూప్-2 పరీక్షల నిర్వహణపై సంబం ధిత అధికారులతో శుక్రవారం కలెక్టర్ సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్షలు సజావుగా సాగేందుకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జిల్లాలో 28,101 మంది అభ్యర్థుల కోసం 85 పరీక్షా కేంద్రా లను ఏర్పాటు చేశామన్నారు. ప్రతీ గదిలో 24 మంది అభ్యర్థులు పరీక్ష రాస్తారని, ప్రతి అరగంటకు ఒక గంట మోగేలా చర్యలు చేపట్టాలన్నారు. అభ్యర్థులు పరీక్ష ముగిసిన తర్వాతే బయటకు రావాలని సూచిం చారు. మహిళా అభ్యర్థుల పరిశీలనకు ప్రైవసీ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అభ్యర్థులను పరీక్ష హాల్‌లోకి ఉదయం 8:30 గంటలకు, మధ్యాహ్నం 1:30 గంటలకు అనుమతి ఇవ్వాలని, గేటు మూసిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ ఆల స్యంగా వచ్చిన వారిని అనుమతించొద్దని సూచిం చారు. రీజినల్ కో ఆర్డినేటర్లు డాక్టర్ వి.చిన్నయ్య, డాక్టర్ రాజ్‌కుమార్, డీఆర్వో రాజేశ్వరి, కలెక్టరేట్ ఏవో అరుణ, పరీక్షా కేంద్రాల సీఎస్‌లు పాల్గొన్నారు.

అరగంట ముందే గేట్లు మూసివేత: జితేశ్

కొత్తగూడెం ఎడ్యుకేషన్, డిసెంబర్ 13: ఈ నెల 15, 16 తేదీల్లో గ్రూప్-2 పరీక్ష రాసే అభ్యర్థులకు భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ శుక్రవారం కీలక సూచనలు చేశారు. అభ్యర్థులు ముంద స్తుగా కేంద్రాలకు చేరుకోవాలని, అరగంట ముందుగానే పరీక్షా కేంద్రాల గేట్లు మూసివేయా లని నిర్వాహకులకు సూచించారు. టీజీపీఎస్‌సీ వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవా లన్నారు. దానిని ఏ4 సైజ్ పేపర్‌లో కలర్ ప్రింట్ తీసుకోవాలని, హాల్‌టికెట్‌పై అభ్యర్థులు తమ తాజా పాస్‌పోర్టు ఫొటోను అతికించాలని సూచిం చారు. డౌన్‌లోడ్ చేసిన హాల్‌టికెట్‌పై ఫొటో సరిగా ముద్రించి లేకుంటే గెజిటెడ్ ఆఫీసర్ చేత సంతకం చేయించుకోవాలన్నారు. పరీక్ష రాసే అభ్యర్థులు చెప్పులు మాత్రమే ధరించాలని, యువతులు ఆభ రణాలు ధరించకూడదని పేర్కొన్నారు. అభ్యర్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

కేటీపీఎస్‌లో ఇంజినీర్లు, కార్మికుల ధర్నా

పాల్వంచ ప్లాంట్ వద్ద కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు

పాల్వంచలో కేటీపీఎస్ కర్మాగారం గేటు వద్ద ధర్నా నిర్వహిస్తున్న ప్లాంట్ ఇంజినీర్లు, కార్మికులు

పాల్వంచ రూరల్, డిసెంబర్ 13: నేషనల్ కో ఆర్డి నేషన్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్, ఇంజి నీర్స్ పిలుపు మేరకు ఉత్తరప్రదేశ్‌లోని చుడీగఢ్ విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణకు నిరసనగా, కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కేటీపీఎస్ జేఏసీ ఆధ్వర్యంలో ఇంజినీర్లు, కార్మికులు భద్రాద్రి కొత్త గూడెం జిల్లా పాల్వంచలోని అంబేద్కర్ సెంటర్‌లో శుక్రవారం ధర్నా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరణ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్న దని ఆరోపించారు. అలాంటి ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలని, విద్యుత్ సంస్థలన్నీ రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనే ఉండాలని డిమాండ్ చేశారు. రామగుండం థర్మల్ ప్లాంటు నిర్మాణం జెన్‌కో పరిధి లోనే జరగాలని నాయకులు పేర్కొన్నారు. కేటీపీఎస్ కార్మిక సంఘం నాయకులు ఉమామహేశ్వరరావు, యాస్మిన్, బ్రహ్మాజీ, మహేశ్, సీతారామిరెడ్డి, పరశు రామ్, కోటేశ్వరరావు, మజీద్, రాధాకృష్ణ, వినోద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి
- భద్రాద్రి జిల్లా సమీక్షలో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి

సమీక్షలో మాట్లాడుతున్న రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి, చిత్రంలో భద్రాద్రి కలెక్టర్

భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లో ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం కలెక్ట రేట్‌కు వచ్చిన ఆయనకు మొదట కలెక్టర్ జితేశ్ వి పాటిల్, ఐటీడీఏ పీవో రాహుల్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్ పుష్పగుచ్ఛం అందించి ఘన స్వాగతం పలికారు. అనం తరం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నూరు శాతం ఓటరు నమోదు కార్యక్రమాన్ని తప్ప నిసరిగా పూర్తి చేయాలని సూచించారు. ఓటు నమోదుపై ఏజెన్సీ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించి.. నమోదు కోసం దర ఖాస్తు చేసుకునేలా చూడాలన్నారు. దివ్యాం గులు, ట్రాన్స్‌జెండర్లను గుర్తించి నేరుగా అధికారులే వెళ్లి ఓటు కోసం దరఖాస్తు చేసు కునే విధానంపై అవగాహన కల్పించాల న్నారు. అలాంటి దరఖాస్తులను ఈ నెల 25వ తేదీలోపు పరిష్కరించుకోవాలని అధి కారులను ఆదేశించారు. బీఎల్వో వ్యవస్థను మరింత పటిష్ట పరిచేలా చూడాలని తహసీ ల్దార్లకు సూచించారు. ఎమ్మెల్సీ ఓటరు నమోదును మరింత వేగవంతం చేయాలని, ఉపాధ్యాయులు, పట్టభద్రులు, ఇతర ప్రాంతాల్లో ఉంటే పరిశీలన చేసి వారికి అవ గాహన కల్పించాలన్నారు. ఓటరు నమోదు తోపాటు సవరణల్లో భాగంగా మార్పులు, చేర్పులు, ఓటరు గుర్తింపు కార్డుల జారీ లాంటివి ఎప్పటికప్పుడు చేపడుతూ.. ప్రజలకు సహకరిం చాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ జితేశ్ వి పాటిల్ మాట్లాడుతూ జిల్లాలోని నియోజకవర్గాల వారీగా పోలింగ్ కేంద్రాలు, ఓటరు వివరాలు, గతంలో ఓటర్లు, నమోదు కోసం చేపట్టిన ప్రత్యేక కార్యక్రమాల గురించి వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు, ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొ న్నారు. కాగా.. తొలుత ఇల్లెందు అతిథి గృహానికి వచ్చిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డికి ఎస్పీ రోహిత్‌రాజు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

పారదర్శకంగా ఓటరు జాబితా సవరణ

ఓటరు జాబితా సమీక్షలో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి

ఖమ్మంలో మాట్లాడుతున్న సీఈవో సుదర్శన్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్ ఖాన్

మామిళ్లగూడెం, డిసెంబర్ 13: ఓటరు జాబితా సవ రణ కార్యక్రమాన్ని పారదర్శకంగా చేప ట్టాలని, ప్రతి దశ లోనూ పార్టీల ప్రతి నిధులను భాగస్వా ములను చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి.సుదర్శన్‌రెడ్డి సూచించారు. ఓటర్ల సవరణ జాబితా-2025పై కలెక్టర్ ముజ మ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి లతో కలిసి ఖమ్మం కలెక్టరేట్‌లో సంబంధిత అధి కారులతో శుక్రవారం ఆయన సమీక్షించారు. జిల్లాలో ఓటర్ల సవరణ జాబితా-2025, వరం గల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితా నమోదుపై చేప డుతున్న చర్యలపై కలెక్టర్ వివరించారు. ఈ సంద ర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ ఓటరు జాబి తాలో ఉన్న తప్పొప్పులను సరి చేసేందుకు జాబితా సవరణ మంచి అవకాశమని, ఇంటింటి సర్వే పకడ్బందీగా నిర్వహిస్తే ఓటరు జాబితా సవ రణ విజయవంతంగా పూర్తి చేయగలమని తెలి పారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ జిల్లాలో 5 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయని, వీటిలో మొత్తం 12,27,230 మంది ఓటర్లతో డ్రాఫ్ట్ తయారు చేశామన్నారు. జిల్లావ్యాప్తంగా 27,287 మంది దివ్యాంగ ఓటర్లు ఉన్నారని, నవంబర్‌లో నిర్వహించిన ప్రత్యేక ప్రచారంలో 1,181 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై వచ్చిన 21,277 దరఖా స్తులలో ఇప్పటివరకు 18,097 పరిష్కరించామ న్నారు. డిసెంబర్ 30 నాటికి తుది ఓటర్ల జాబితా ప్రకటిస్తామని కలెక్టర్ తెలిపారు. కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ట్రైనీ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, డీఆర్వో రాజేశ్వరి, ఆర్డీవోలు నర్సింహా రావు, రాజేందర్, తహసీల్దార్లు పాల్గొన్నారు.